క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన కొప్పురావూరి భవ్య హాసిని ఇటీవల విడుదల అయిన పాలిసెట్ ఫలితాల్లో 100/120 మార్కులతో స్టేట్ 1,297వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన అభినందన సభలో పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఇంతటి మంచి ర్యాంక్ సాధించడం మన సత్తెనపల్లి పట్టణానికి చాలా గర్వకారణమని సీఐ శ్రీనివాసరావు అన్నారు. సిద్ధికా కోచింగ్ సెంటర్ డైరెక్టర్స్ షేక్ సుభాని, షేక్ అహ్మద్ రూ. 5 వేలు నగదుని భవ్య హాసినికి బహుమతిగా అందించారు. దుశ్శాలువాలతో సత్కరించారు.

ఎన్నికల నేపథ్యంలో టీడీపీ దాడులు

క్రోసూరు: మండలంలో సోమవారం ముమ్మరంగా పోలింగ్ జరగటంతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందన్న కక్షతో టీడీపీ కార్యకర్తలు దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు కొందరు దాడి చేయబోగా తప్పించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని జరిగిన విషయంపై నిలదీసేందుకు వెళ్లగా రాళ్లు, కర్రలతో దాడి చేయబోయినట్లు ఆ పార్టీ యూత్ నాయకుడు షేక్ షుకుర్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. క్రోసూరులోని కొండకింద బజారులోని టీడీపీ కార్యకర్త అదే వైఎస్సార్ సీపీ కార్యకర్త గండికోట సాయి ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. అతని అతని భార్యపై దౌర్జన్యం చేసి, ఇంటిలో సామగ్రి ధ్వంసం చేసాడని బాధితులు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. గ్రామంలో ఉద్రిక్తతలు పరిస్థితి నెలకొనటంతో పోలీసులు దుకాణాలు మూయించారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు యువకుడు మరణించాడు. గ్రామస్తులు సమాచారం మేరకు బలుసుపాటి వినయ్(20)మంగళవారం గేదెలను తోలుకుని పొలానికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో కూడి గాలివాన రావటంతో ఇంటికి పోదామని బయులదేరుతుండగా ఒక్కసారి పిడుగు పడి వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినయ్ మృతదేహన్ని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. చేతికంది వచ్చిన కొడుకు మరణించటంతో వినయ్ తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో 11కేవీ లైన్‌లో చెట్ల కొమ్ములు తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్, బస్ స్టాండ్ ఏరియా, ఇండోర్ స్టేడియం, కెనారా బ్యాంక్, ఓల్డ్ బస్ స్టాండ్ ఏరియా, పార్క్ ఏరియా, మార్కెట్ ఏరియా, క్లాక్ టవర్ దగ్గర రామాలయం వీధి ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఏదైనా విద్యుత్ సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 94941 16238కు ఫోన్ చేయాలన్నారు.

క్రోసూరులో 90.83 శాతం పోలింగ్



క్రోసూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ వివరాలను ఎన్నికల సహాయ అధికారి తులసి రామ్ మంగళవారం వివరాలు తెలిపారు. క్రోసూరు మండలంలో 90.83 శాతం పోలింగ్ జరిగినట్లు చెప్పారు. మొత్తం ఓటర్లు 50,607మంది కాగా పోలైన ఓట్లు 45,967లని వెల్లడించారు. 90.83 శాతం ఓట్లు పోలైనట్లు చెప్పారు. పురుష ఓట్లు మొత్తం 24,837మంది, మహిళా ఓటర్లు 25,766మంది, ఇతరులు నలుగురు ఉండగా పురుషులు 22,749 మంది, మహిళలు 23,218 మంది ఓట్లు వేశారని చెప్పారు. మొత్తం 45,967 మంది ఓట్లు వేసినట్లు చెప్పారు.

బెల్లంకొండలో ఎన్నికలు ప్రశాంతం
మండలంలో 88.37 శాతం పోలింగ్

బెల్లంకొండ: మండలంలోని కొన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి 8 గంటల వరకు ఓటర్లు క్యూ లైన్లలో నిల్చుని ఓటు వేశారు. కొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు గొడవలు సృష్టించేందుకు యత్నించారు. చంద్రాజుపాలెం, పాపాయపాలెం, వెంకటాయపాలెం, మాచాయపాలెం గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు మినహా మిగిలిన గ్రామాల్లో ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 88.37 శాతం పోలింగ్ నమోదైయినట్లు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు.

చైతన్యం ఓటెత్తింది

తెల్లవారక ముందే చైతన్యం ఓటెత్తింది. ఇంకా పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బంది తేరుకోకనే గేట్ల ముందు ఓటర్లు బారులు తీరారు. ఓటర్ల చైతన్యానికి తోడు వాతావరణం ఉపకరించడంతో పోలింగ్ శాతం పెరగడానికి మరింత అవకాశం ఏర్పడింది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా పోలింగ్ నమోదులో సత్తెనపల్లి నియోజకవర్గం రెండవ స్థానంలో నిలిచింది. టీడీపీ మూకల దౌర్జన్యాలకు తోడు పోలీసుల సహకారం కొరవడటంతో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆయా కేంద్రాల్లో చల్లని తాగు నీరు, మందులు ఏర్పాటు చేసి వైద్యులను అందుబాటులో ఉంచారు. ఎన్నికల సందర్భంగా ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి. హోటళ్లు, దుకాణాలు మూసివేయడంతో సోమవారం అయినప్పటికీ ఆదివారాన్ని తలపించింది.



సత్తెనపల్లిలో ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



సత్తెనపల్లి ఎన్జీవో హోం సెంటర్ ఉదయం 11 గంటలకే ఖాళీగా ఇలా..

- ఉదయం నుంచే కేంద్రాల్లో బారులు తీరిన ఓటర్లు
- దాడులకు తెగబడిన టీడీపీ మూకలు
- పలు పోలింగ్ బూత్‌లలో టీడీపీ నేతల రిగ్గింగ్..

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గ ఓటర్లు ఉత్సాహం కనబరిచారు. ఓటు వేసేందుకు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అదే ఉత్సాహం చివరి వరకు కొనసాగితే 90 శాతం పోలింగ్ దాటుతుందనుకున్నారు. ఈవీఎంల మొరాయింపు, ఓటింగ్ ప్రక్రియ జాప్యం కారణంగా సాయంత్రం వరకు పోలింగ్ జరిగింది. దాదాపు నాలుగు గంటలకే సగానికి పైగా పోలింగ్ కేంద్రాలు ఖాళీ అయ్యాయి. పట్టణంలోని ఎన్జీవో హోం సెంటరులోని పోలింగ్ కేంద్రం ఉదయం 11 గంటలకే ఖాళీగా కనిపించింది. ఇలా పలు కేంద్రాల్లో వేగంగా ఓట్లు పోలయ్యాయి. కంకణాలపల్లి తదితర గ్రామాల్లో రాత్రి వరకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,42,047 మంది ఓటర్లు ఉండగా అదులో పురుషులు 1,18,400 మంది గాను 1,03,116 మంది, మహిళలు 1,23,635 మందికి గాను 1,07,381 మంది, థర్డ్ జెండర్ 12 మందికి గాను ముగ్గురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2,10,500 ఓట్లు పోలయ్యాయి. 86.97 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులు 87.09 శాతం ఓటు హక్కు వినియోగించుకుంటే మహిళలు 86.85 శాతం, ఇతరులు 25 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికలతో పోల్చి చూస్తే 0.67 శాతం పోలింగ్ తగ్గింది.

టీడీపీ రిగ్గింగ్..అత్యధికంగా పోలింగ్..

ఇదిలా ఉంటే టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిన పోలింగ్ బూత్‌లలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామంలోని 253 పోలింగ్ కేంద్రంలో 753 ఓట్లకు 721 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా 95.75 శాతం నమోదైంది. అదే గ్రామంలోని 254 పోలింగ్ బూత్‌లో 686 ఓట్లకు 650 ఓట్లు పోలయ్యాయి.. 94.75 శాతం పోలింగ్ నమోదైంది. నార్నెపాడు గ్రామంలో 236 పోలింగ్ కేంద్రంలో 900 ఓట్లకు 828 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 92 శాతం పోలింగ్ నమోదైంది. 237 పోలింగ్ బూత్‌లో 1,049 మందికి గాను 911 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 86.84 శాతం ఓటింగ్ జరిగింది. నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలోని 197 పోలింగ్ బూత్‌లో 1,225 మంది ఓటర్లకు 1,048 ఓట్లు పోలవ్వగా..85.55 శాతం, 198 పోలింగ్ బూత్‌లో 885 ఓట్లకు గాను 748 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 84.52 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారిక లెక్కలు చూపిస్తున్నాయి. ఈ పోలింగ్ శాతాన్ని బట్టి ఇక్కడ ఏ మేరకు టీడీపీ మూకలు అక్రమాలకు పాల్పడ్డారో చెప్పకనే తెలుస్తోంది.

నియోజకవర్గంలో పోలింగ్ సరళి....

సమయం	శాతం
ఉదయం 9 గంటలకు	8.25
ఉదయం 11 గంటలకు	23.63
మధ్యాహ్నం 1 గంటకు	41.46
మధ్యాహ్నం 3 గంటలకు	57.37
సాయంత్రం 5 గంటలకు	71
రాత్రి 7 గంటలకు	82.25
పూర్తయ్యేసరికి	86.97

టీడీపీ దౌర్జన్యం.. పట్టించుకోని పోలీసులు

నియోజకవర్గంలో పలుచోట్ల టీడీపీ మూకలు దౌర్జన్యానికి దిగినప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబును హౌస్ అరెస్ట్‌లో భాగంగా ఇంటికి వెళ్లమని చెప్పిన పోలీసులు ... టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా స్వేచ్ఛగా తిరగనిచ్చారు. దీంతో టీడీపీ మూకలు మరింతగా రెచ్చిపోయి పోలింగ్ బూత్‌ల్లో అరాచకాలు సృష్టించారు. ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు, నార్నెపాడు, నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామాల్లోని ఆరు పోలింగ్ బూత్‌ల్లో టీడీపీ మూకలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. వీటిని అడ్డుకోవాల్సిన సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు అలాంటి చర్యలు తీసుకోకపోగా టీడీపీ వర్గానికి పూర్తిస్థాయిలో సహకరించి వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద ఎక్కువ మంది పోలీసులను బందోబస్తు నిమిత్తం ఉంచి ఓటర్లను భయాందోళనలకు గురిచేశారు. వెబ్ కెమెరాలను పరిశీలించి, రీ-పోలింగ్ ద్వారా ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ నేతలతో పాటు ప్రజలు కోరుతున్నారు.

మధ్యవర్తిత్వంతో ఎక్కువ కేసులు పరిష్కారం



సత్తెనపల్లి: మధ్యవర్తిత్వం నిర్వహించి అధికంగా కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ చిలంకుర్తి వెంకట నాగ శ్రీనివాస రావు పేర్కొన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అయనతో పాటు సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. ముందుగా జడ్జి వెంకట నాగ శ్రీనివాస రావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం చట్టం గురించి, కేసుల పరిష్కారంతో కక్షిదారులకు వచ్చే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రజలకు ఈ-సెంటర్ ప్రాముఖ్యతపై న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. దీనిలో కేసు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపస్ ఇస్తారని, అంతేకాకుండా దీని ద్వారా వచ్చేది అంతిమ తీర్పు స్పష్టం చేశారు. ఆ శక్తి కలిగిన న్యాయవాదులు ఈ-సెంటర్ ద్వారా కేసుల్లో మధ్యవర్తిత్వం చేసేందుకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ అధ్యక్షత వహించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రాత్రి 11గంటల వరకు పోలింగ్

అచ్చంపేట: సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం మండలంలోని 88 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దారు కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చామర్రు, చల్లగరిగ, చెరుకుంపాలెం గ్రామాల్లో రాత్రి 11గంటల వరకు పోలైనట్లు చెప్పారు. రెండు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించామని తెలిపారు. కొన్ని గ్రామాల్లో పోలింగ్ సమయం ముగిసిన తర్వాత క్యూలో నిలుచున్న వారందరికి స్లిప్‌లు ఇచ్చి ఓటింగ్ చేయించామన్నారు.

అత్యధికంగా మహిళా ఓటింగ్

- కొన్ని గ్రామాల్లో 90శాతానికి మించిన పోలింగ్
- అధికంగా ఓటు సద్వినియోగం చేసుకున్న మహిళలు
- జోరుగా పందేలు..రెండు పార్టీల్లో ఎవరి అంచనాలు వారివే



గ్రామాల్లో ఓటు వినియోగించుకోవటానికి వచ్చి ఓటర్లు

అమరావతి: మండల పరిధిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రమే 80 శాతానికి మించి పోలింగ్ జరిగేది. నేడు సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల కంటే అధికంగా పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు చేసిన ప్రయత్నాలు సఫలీకృతం అయ్యాయనే చెప్పాలి. అలాగే ఈ దఫా నూతన చేర్పులతో ఓటు పొందిన యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చింది. అలాగే రాజకీయ పార్టీలు కూడా ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వంటి కారణాలతో ఓటింగ్ శాతం పెరిగింది. ఈవీఎంలు మొరాయించినా, కొన్ని చోట్ల పోలింగ్ మందకొడిగా సాగినా రాత్రి 11 గంటల వరకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయటానికి క్యూ లైన్లలో ఓటర్లు బారులు తీరారు. మండల పరిధిలోని సరాసరి పోలింగ్ శాతం 87.62శాతానికి చేరింది. 2019 ఎన్నికల కంటే ఒక శాతం తగ్గింది. మొత్తం 59,104ఓట్లకు గాను 51,787ఓట్లు పోలయ్యాయి. మండల కేంద్రంలో అమరావతిలో 75 శాతం, పెద్ద గ్రామమైన ధరణికోటలో 85శాతం ఓట్లు పోలవ్వగా మిగిలిన అన్ని గ్రామాల్లో 90శాతానికి పైగా ఓట్లు పడటం విశేషం.

ఎవరి అంచనాలు వారివే

మండల పరిధి గ్రామాల్లో భారీగా ఓట్లు వినియోగించుకోవడంతో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు గ్రామాల వారిగా తమకు వచ్చే ఓట్లను లెక్కగట్టి.. తమకు అనుకూలంగా ఉన్న గ్రామాల్లో మెజారిటీపై అంచనాలు వేసుకోవడంలో మునిగిపోయారు. రెండు పార్టీల మధ్య తీవ్రమైన పోటీలో మండలంలో 25,413 మంది మహిళలు అత్యధికంగా ఓటు వేశారు. దీంతో ఈ సారి వైఎస్సార్ సీపీకి స్పష్టమైన అధిక్యత వస్తుందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రూ.లక్షల్లో పందేలు కాస్తున్నట్లు సమాచారం. రెండు పార్టీలు పోలింగ్ తమకే అనుకూలమని చెబుతున్నాయి.

గ్రామాల వారీగా పోలింగ్ ఇలా..

అమరావతిలో 12,549 ఓట్లకు గాను 9,534 ఓట్లు పోలయ్యాయి. కర్లపూడి 2,271 ఓట్లకు 2,038, నెమలికల్లులో 2,320 ఓట్లకు 2,171, లేమల్లెలో 2,895 ఓట్లకు 2,627, మల్లాదిలో 2,531 ఓట్లకు 2,386, ఎండ్రాయిలో 1,539 ఓట్లకు 1,410, చావపాడులో 1,005 ఓట్లకు 933, నరుకుళ్ల పాడులో 2,017 ఓట్లకు 1,869, ధరణికోటలో 6,949 ఓట్లకు 5,950ఓట్లు పోలయ్యాయి. జూపూడిలో 2,168 ఓట్లకు 1959, వైకుంఠపురంలో 2,930 ఓట్లకు 2,705, మునగోడులో 3,207 ఓట్లకు 2,977, ఉంగుటూరులో 2,407 ఓట్లకు 2,121, పెదమద్దూరులో 1,282 ఓట్లకు 1215, లింగాపురం 3,357ఓట్లకు 3,134, దిడుగులో 2,780ఓట్లకు 2,523, మండెపూడిలో 2,818 ఓట్లకు 2,556, అత్తలూరులో 4,079 ఓట్లకు 3,679 ఓట్లు పోలయ్యాయి.

20 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తాం

- మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న వైఎస్సాఆర్ సీపీ
- మెజార్టీ గ్రామాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడిన టీడీపీ
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



టీడీపీ మూకల దాడుల వీడియోను మీడియాకు చూపుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

నగరంపాలెం: పెదకూరపాడు నియోజకవర్గంలో 20 వేల ఓట్ల మెజారిటీతో గెలవనున్నట్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావు అన్నారు. గుంటూరు ఆర్టీఓ రోడ్‌లోని కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తన గెలుపు నల్లేరుపై నడక అని పేర్కొన్నారు. వైఎస్సాఆర్ సీపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని చెప్పారు. ఐదేళ్లల్లో సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే గెలుపునకు కారణమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ మళ్లీ అమలవుతాయనే ఆలోచనతో రాష్ట్ర ప్రజలు ఉప్పెనలా వైఎస్సాఆర్ సీపీకి ఓట్లేశారన్నారు. కేవలం ఎన్నికల కమిషన్‌ను వాడుకునేందుకు చంద్రబాబు బీజేపీతో జతకట్టారని ఆరోపించారు. వ్యవస్థలను ఉపయోగించుకోవడంలో చంద్రబాబు దిట్ట అని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఇబ్బంది పెట్టాలనేది చంద్రబాబు లక్ష్యమన్నారు. పెదకూరపాడులో 89.13 శాతం పోలింగ్ నమోదైందిని, ఎస్సీ ఓటర్లనే లక్ష్యంగా టీడీపీ గుండాలు, రౌడీ మూకలు దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. పోలింగ్ బూత్‌ల్లోకి చొరబడి దౌర్జన్యా లకు పాల్పడ్డారని, భయభ్రాంతులు సృష్టించారన్నారు. టీడీపీ గెలవలేక దాడులకు ఒడిగట్టిందని, ఎస్సీలను లక్ష్యంగా చేసుకుని కంభంపాడు, కొత్తపల్లి, అచ్చంపేట, దోడ్లేరు, వేల్పూరు తదితర గ్రామా ల్లో వారి కాళ్లు విరగొట్టి, తలలు పగులకొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 15 గ్రామాల్లో భయానకం సృష్టించారని తెలిపారు. వైఎస్సాఆర్ సీపీ మెజార్టీ గ్రామాల్లో పోలింగ్ పక్రియను తగ్గించాలనే ధ్యేయంతో దాడులకు ఒడిగట్టారని నంబూరు మండిపడ్డారు. కంభంపాడు ఎస్సీకాలనీలో, హుస్సేన్‌నగర్ సర్పంచి, పెదకూరపాడులో ఎస్సీలను చితకబాదారని ఆయన చెప్పారు. దోడ్లేరులోనూ ఓ నాయకుడ్ని కిందపడేసి మరి చితకబాదారని, చింతపల్లిలో ఓట్లు వేసేందుకు ఓటర్లను బయటకు రానీవ్వలేదని చెప్పారు. 75 తాళ్ళూరు, దోడ్లేరు, అచ్చంపేట, పాటిబండ్ల, ఇతర గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన దాడులకు సంబంధించి వీడియోలను ఆయన మీడియాకు చూపించారు. కొత్తగా వచ్చిన వారు ఇరవై రోజుల తర్వాత నియోజకవర్గం వదిలి వెళ్తారని జోస్యం చెప్పారు. శంకరరావు గెలిస్తే సంక్షేమ పథకాలు వస్తాయనే అకాంక్షతో ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలకు ఆయన హృదయ పూర్వకమైన అభినందనలు తెలిపారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి పాల్గొన్నారు.

పెదకూరపాడులో పోటెత్తిన ఓటర్లు

- నియోజకవర్గంలో 89.18 శాతం పోలింగ్
- అత్యధికంగా క్రోసూరులో 90.63, అత్యల్పంగా అమరావతిలో 87.66 శాతం
- బలుసుపాడు, ఆత్తలూరు, చెరుకుంపాలెంలో ఆర్ధరాత్రి వరకు పోలింగ్
- పురుషులు కన్న మహిళలు అధికంగా 3,636 మంది ఓటు హక్కు వినియోగం



గారపాడులో బారులు తీరిన ఓటర్లు(ఫైల్

పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం పెదకూరపాడు నియోజకవర్గంలో మొత్తం 89.18శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,32,453 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,07,307 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 1,13,398 మందికి గాను 1,01,833 మంది, స్త్రీలు 1,19,039 మందికి గాను 1,05,469 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు మొత్తం 16 మంది ఉండగా వారిలో ఐదుగురు ఓటు వేశారు. పురుషులు 89.80శాతం, స్త్రీలు 88.60 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా క్రోసూరు మండలంలో 90.83శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యల్పంగా అమరావతి మండలంలో 87.66శాతం ఓటింగ్ నమోదైంది.

అత్యధికం 97.06శాతం..

అత్యల్పం 69.05 శాతం

నియోజకవర్గంలో అత్యధికంగా పెదకూరపాడు మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో 171 బూత్‌లో మొత్తం 887 ఓట్లు ఉండగా వాటిలో 861 ఓట్లు పోలయ్యాయి. 97.06శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా అమరావతి మండలంలోని అమరావతి గ్రామంలో 229 బూత్‌లో 1,085 ఓట్లుకు 749ఓట్లు పోలయ్యాయి. 69.05శాతం ఓటింగ్ నమోదైంది.

గతం కన్న 0.16 శాతం తగ్గిన ఓటింగ్

2019 ఎన్నికల్లో నియోజవర్గంలో మొత్తం 89.34 శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 89.18శాతం నమోదు అయింది. ఈ ఎన్నికల్లో పురుషులు కన్న అధికంగా మహిళలు 3,636 మంది ఓటు వేశారు.

పచ్చమూకలు బరితెగింపు..

ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో పలు గ్రామాల్లో టీడీపీ పచ్చమూకలు బరితెగించి దాడులకు పాల్పడ్డాయి.

- పెదకూరపాడు మండలంలోని కంభంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ సర్పంచ్ ఆర్తిమళ్ల నాగేశ్వరరావుతో పాటు కుటుంబ సభ్యులను విచక్షణ రహితంగా కత్తులు, కర్రలతో దాడులు చేశారు.
- పెదకూరపాడులోని 167,168 బూత్‌లో వైఎస్సార్ సీపీ ఏజెంట్ వెంకటేష్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.
- బలుసుపాడు గ్రామంలో పోలింగ్ కేంద్రంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దాడులకు చేశారు.
- అచ్చంపేట మండలంలోని వేల్పూరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడులకు పాల్పడ్డారు.
- కొత్తపల్లి ఎస్సీ కాలనీపై దాడులకు పాల్పడ్డారు. అచ్చంపేటలో స్వల్ప వివాదం చోటు చేసుకుంది.
- దోడ్లేరులో వైఎస్సార్ సీపీ నాయకులు ఆవుల ఆంజిరెడ్డిపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడ్డారు.

అర్ధరాత్రి వరకు పోలింగ్

నియోజకవర్గంలోని పెదకూరపాడు మండలం బలుసుపాడు, అమరావతి మండలం ఆత్తలూరు, అచ్చంపేట మండలం చెరుకుంపాలెం గ్రామాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ నిర్వహించారు. క్యూలైన్‌లో ఓటర్లకు స్లిప్పులు ఇచ్చి ఓటు వినియోగించుకునేంత వరకు పోలింగ్ నిర్వహించారు.

మండలాల వారీగా పోలింగ్ వివరాలు

మండలం	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
బెల్లంకొండ	27,099	23,949	88.37
అచ్చంపేట	53,406	47,296	88.55
క్రోసూరు	50,607	45,867	90.83
పెదకూరపాడు	42,237	38,283	90.63
అమరావతి	59,104	51812	87.66
మొత్తం	2,32,453	20,7307	89.18

జోరున వర్షం.. చల్లబడిన వాతావరణం



పొలంలో నిలిచిన వర్షపు నీరు



కారంపూడి రహదారిలో నిలిచిన వర్షపు నీరు

గురజాల: మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం భానుడు తన ఉగ్రరూపం దాల్చాడు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు గంట పాటు ఈదురు గాలులు వీస్తూ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, కోర్టు భవనాల ప్రాంగణం, సెబ్ కార్యాలయ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది.

జోరున వర్షం..

క్రోసూరు: మండలంలో మంగళవారం సాయంత్రం జోరున వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవటంతో రోడ్లు, పొలాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండి సాయంత్రం వాతవరణం ఒక్కసారిగా మారిపోయి జోరున వర్షం కురిసింది. సుమారు అరగంట వరకు వర్షం కురవడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

చేజర్లలో ఘర్షణ

- పలువురికి గాయాలు
- ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్న టీడీపీ

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో ఇరువర్గాల ఘర్షణ నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పలువురికి గాయాలయ్యాయి. కార్చిర్చులా ఊరంతా చుట్టుకునే సమయానికి పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం తాత్కాలికంగా సర్దుమణిగింది. టీడీపీ వర్గీయులు ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్ సీపీ వర్గీయులపై దాడికి పాల్పడినట్లు సమాచారం. దీంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు చెందిన వారు అధిక సంఖ్యలో కర్రలతో దాడికి సిద్ధమయ్యారు. గ్రామమంతా అట్టుడికి పోయింది. సామాన్య ప్రజలు తీవ్ర భయ భ్రాంతులకు గురయ్యారు. సమయానికి పోలీసులు రంగప్రవేశం చేసి అల్లరి మూకలను చెదరగొట్టారు. ఘర్షణలో వైఎస్సార్ సీపీకి చెందిన ఏరుగొని యలమంద, గుంజా కాశేశ్వరరావు, బత్తుల వేణులతో పాటు మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ ఎం.రాంబాబు, నకరికల్లు, రాజుపాలెం ఎస్ఐలు పి.రాంబాబు, సమీర్ బాషా పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.